
# శోధన

డా॥ ఎం. హరికిషన్




పక్షులింకా గూళ్ళు వదల్లేదు.

చంటి పాపలు అమ్మలను కర్చుకుని కమ్మగా నిద్రపోతావున్నారు.

రాత్రంతా అరచీ అరచీ అలసిపోయిన వీధికుక్కలు మట్టసంగా పన్నుకోనున్నాయి. ఆకాశం వెలుగు రేఖలకై ప్రసవవేదనకు సిద్ధమవుతావుంది.

గబగబా అన్నం క్యారేజీ, నీళ్ల బాటిలూ బ్యాగులో సర్దుకుని బయట పడేముందు భార్యకళ్ళలోకి ఒకసారి దీర్ఘంగా చూశాను.




ప్రతిసారి పోయేముందు అదే చివరి చూపేమో అన్నట్లు చూడడం అలవాటయిపోయింది.

భార్యాపిల్లల మొహాలు కనుపాపల్లో పదిలపరచుకొని బైటపడ్డాడు.

టైం ఐదవుతావుంది.

ఐదున్నర దాటిందో బస్సుండదు.

మరలా ఎనిమిది వరకు మరో బస్సు లేదు.

క్షణక్షణానికి పెరిగిపోయే జన ప్రవాహంలో అటూయిటూ చూస్తూ, నాలా బస్సు తప్పిపోయిన ప్రయాణీకులను పలుకరిస్తూ, బలవంతపు చిరునవ్వులు చిందిస్తూ మరోపక్క నిమిషానికోసారి టైం చూసుకుంటూ, అసహనంగా,మన మంతా గజిబిజిగా గడపాలి.

ఆ బస్సుకూడా సరిగ్గారాదు.

లగేజి ఎక్కువైందా అక్కడా యిక్కడా దించుతూ.. ఎక్కిస్తూ ముక్కుతూ మూల్గుతూ ఎప్పుడో దానిష్టమొచ్చినప్పుడు వస్తుంది.

దాంట్లో పోతే అంతే.

లేటు సంజాయిషీ కొన్నిసార్లు తిట్లు ఖర్మకాలి ఎవరయినా పై అధికారి వచ్చింటే మెమోలు.

సైకిల్ స్టాండ్లో పెట్టేసి ఆయసపడుతూ స్టాప్‌కి చేరుకున్నాను.

ఇంకా బస్సు రాలేదు.

గస తగ్గింది రిలాక్సయ్యాక చుట్టూ చూశాను.

మిత్రుడొకడు చిరునవ్వుతో పలకరించాడు.

కబుర్లలో పన్నాం.

మా దారిన పోయే జనాలు చాలా మంది అక్కడక్కడ తచ్చాడుతున్నారు.

కాసేపటికి బస్సొచ్చింది.

ఎక్కడెక్కడో కాపుకాస్తున్నారో జనాలంతా ఒక్కసారిగా ఎగబడ్డారు.

ఒకరినొకరు తోసుకుంటూ సీటుకోసం గబగబా ఎక్కేస్తున్నారు.

అరుపులు కేకలు తొక్కిసలాట.

మధ్యలో గంపలు... మూటలు కోళ్ళు.

కొందరు కర్చీపులు, తువ్వాళ్లు, సంచులు సీట్ల మీద కిటికీల్లోంచి ఏసేస్తున్నారు మరికొందరు పిల్లల్ని కిటికీల్లోంచి లోపలికి పంపుతూ వున్నారు.

బలవంతులు, తెలివిమంతులు ముందు సీట్లను ఆక్రమిస్తే మిగతావాళ్ళంతా వెనక సీట్లలో సర్దుకొంటున్నారు.

క్షణక్షణానికి పెరిగిపోయే జన ప్రవాహంలో అటూయిటూ చూస్తూ, నాలా బస్సు తప్పిపోయిన ప్రయాణీకులను పలుకరిస్తూ, బలవంతపు చిరునవ్వులు చిందిస్తూ మరోపక్క నిమిషానికోసారి టైం చూసుకుంటూ, అసహనంగా, మనమంతా గజిబిజిగా గడపాలి.

కష్టపడి సీటు సంపాదిచ్చుకున్నాను.

ప్రయాణం మొదలైంది.

ఎక్కేవాళ్ళు ఎక్కుతావున్నారు.

దిగేవాళ్ళు దిగుతావున్నారు.

ఎవరు ఎప్పుడు ఎక్కడ ఎక్కుతారో తెలీదు.

ఎవరు ఎప్పుడు ఎక్కడ దిగుతారో తెలీదు.

బస్సు పోతూనే వుంది.

బహుశా ఇది నిరంతర ప్రయాణమేమో. రాత్రుళ్ళు విశ్రాంతి తీసుకుంటూ మళ్ళా పొద్దున్నే యధావిధిగా రోడ్డు మీద కొచ్చేస్తావుంటాది.

ఏడేళ్ళుగా రోజూ ప్రయాణిస్తూనే వున్నాను.

మొదట్లో కాస్త ఇబ్బందిగా వుండేది.

ప్రయాణం సరిపడక వాంతులయ్యేవి. ఒళ్ళంతా నీరసంగా, తలంతా దిమ్ముగా, ఏదో ఆందోళనగా వుండేది.

రోడ్లమీద యాక్సిడెంట్ దృశ్యాలను చూసినప్పుడు ఒళ్ళు గగుర్పొడిచేది. భయం ఆవహించి కొన్నిసార్లు దిగి పారిపోదామనిపించేది. కానీ ప్రయాణం నెమ్మదిగా అలవాటయిపోయింది. జీవితంలో ఒక భాగమయిపోయింది.

తుక్కుతుక్కయిన వాహనాలు, చెల్లాచెదురయిన శవాలు, రోడ్లమీద పారిన చిక్కటి రక్తం, గాయాలు, కేకలు ఈ ఘాట్ రోడ్డులో మామూలే.

మొదట్లో అంతా కొత్తకొత్తగా అన్పించేది. ఎవ్వరితోను పరిచయముండేది కాదు. బస్సునిండా చాలావరకు నాలాంటి వుద్యోగస్థులే. నెమ్మదిగా పరిచయాలు పెరిగాయి. పలకరింపులు పెరిగాయి.

ఒకరి గురించి ఒకరికి చెప్పుకునే వాళ్ళం. మన సులు విప్పుకునేవాళ్ళం. బాధలూ సంతోషాలు పంచుకునేవాళ్ళం. బంధువుల్లో కలిసిపోయే వాళ్ళం.

మధ్యమధ్యలో కొందరు రిటైరయ్యేటోళ్ళు.

వయసుమీరి కొందరు, వాలెంటరీ రిటైర్ మెంటిచ్చి మరికొందరు.

కొందరు మాత్రం ఎవరికీ మాటమాత్రమైనా చెప్పకుండా హఠాత్తుగా మాయమయ్యేటోళ్ళు.

ఏవేవో వూహలు ఏవేవో అనుమానాలు భయాలు గుసగుసలు.

ఏదయినా మరణం వార్త విన్నప్పుడు మాత్రం అంతా నిశ్శబ్దం ఏదో వైరాగ్యం.

నాప్రయాణంలో మొదటిసారి నన్ను పలకరించినవాడు, ఆప్యాయంగా ఆలింగనం చేసుకున్నవాడు, నా మొదటి ప్రయాణమిత్రుడు అనుకోకుండా జరిగిన ఆక్సిడెంట్లో నా కళ్ళ ముందే మరణించాడు.

కొన్నాళ్ళపాటు అవే దృశ్యాలు.

అదే మొదటిసారి కావాల్సినవారి మరణాన్ని అంత దగ్గరగా చూడడం తట్టుకోలేపోయాను.

తల్లడిల్లిపోయాను.

కళ్ళు మాటిమాటికీ నీటి వూటలయ్యేవి.

ఇంతేనా జీవితం అనుకున్న గమ్యం చేరకుండానే అనిపించేది.

ఉద్యోగం వదిలేయాలనిపించేది.

కానీ నిస్సహాయత.

మరో దారిలేదు.

ఎమ్మేవరకు చదివి వుద్యోగం లేక నాలుగు సమ్మచ్చరాలు కిందామీదాపడి ఆకలితో నకనకలాడి కనబడినోళ్ళ కాళ్ళన్నీ పట్టుకోని అవమానాలు ఛీత్కారాలు ఎదుర్కొని ఆవేదనతో నిరాశతో బ్రతుకు మీద ఆశచచ్చి రగిలిపోతున్న దశలో కనబడిందీ దారి.

అందుకే వదల్లేను.

ఆ వైరాగ్యం కొద్దిరోజులే.

మళ్ళీ మామూలే.

అదే ప్రయాణం ఎడతెరపి లేకుండా.

బస్సాగింది.

ఎవరో ఒక ముసిలామె మూడు కోళ్ళతో నడవలేక నడుస్తా ఎక్కి మధ్యలో వున్న ఒక ఇనుపరాడ్ పట్టుకుని ఒక సీటును ఆసరాగా చేసుకోని చుట్టూచూడసాగింది.

బస్సు కుదుపులకు ఆమె ముడతలు పడ్డ శరీరం తూలిపోతావుంది.

ఎక్కడయినా కాస్త చోటేమయినా వుందా అని కళ్ళు పెద్దవి చేసి చుట్టూ చూసింది.

అక్కడెవ్వరూ ఆమెని పట్టిచ్చుకోవడం లేదు.

ఎవరి మాటల్లో వాళ్ళు ఎవరి పనుల్లో వాళ్ళు.

కొందరు నాలా చూసినా చూడనట్టుగా మౌనంగా తలలటు వైపుకు తిప్పుకొని ఆమె ఒక్కొక్కరినీ పట్టిపట్టి చూస్తావుంది.

లోతుగా...

ఆశగా...

తలతిప్పుకోని బైటకు చూడసాగాను.

బస్సు ఎక్కిన కొత్తల్లో ఇటువంటి దృశ్యం కనబడగానే మనసు స్పందించేది. ముసలివాళ్ళు, గర్భిణీస్త్రీలు, బాలింతలు ఎవరియినా నిలబడి కనబడితే.. నాకు తెలియకుండానే నా అంతట నేనే వెంటనేలేచి కూర్చోమని సీటు చూపించే వాణ్ణి.

అప్పుడు ఆ కళ్ళలో కనబడే కృతజ్ఞతతో ఎంత దూరమయినా సరే సంతోషంగా నిలబడిపోయే వాన్ని.

కానీ.. ఇప్పుడు ఎందుకిలా ఎటువంటి చలనమూ కలగడం లేదు.

ఇంతకు ముందులా సూటిగా వాళ్ళ కళ్ళలోకి చూడలేకుంటున్నాను.

ఇంకా దారుణమేమిటంటే కొన్నిసార్లు ఆడవాళ్ళ సీట్లలో కూర్చొని కూడా వాళ్ళొస్తే లేవకపోవడం ఏమాత్రం పట్టించుకోకపోవడం.

ఆ ముసిలామె మాటలు వినబడుతున్నాయి. ఎవరినో ప్రాధేయపడతావుంది.

''కాస్త చోటియ్యి కొడకా.. నిలబడలేకుంటున్నాను ముసలిదాన్ని''

''పావుగంటా కాదూ అర్థగంటాకాదు నిలబడ్డానికి చానాదూరం పోవాలి. పో..పోయి ఆ డ్రైవర్ పక్కన బానెట్‌మీద కూచోపో''

బానెట్‌వైపు చూశాను. అప్పటికే దానిమీద ముగ్గురు కూచోనున్నారు.

లేవాలనుకున్నాను.

ఇంకా గంటన్నర ప్రయాణం.

మనసు సహకరించడం లేదు.

వయసయిపోతావుందా..

నిలబడే శక్తిని కోల్పోతున్నానా..

లేదు...

ఏదో వుంది...

ఇంకేదో...

బహుశా ఈ నిరంతర ప్రయాణం నాలో సున్నితత్వాన్ని చంపేసిందా..

అనే దృశ్యాలు.. అవే మాటలు పదే పదే చూచి విని మనసు స్పందించటం మానివేసింది.

ప్రభుత్వ కార్యాలయాల్లో అవినీతిలా

రాజకీయనాయకుల రౌడియిజంలా

టీవీ విలేఖరుల ఓవరాక్షన్లా..

సినిమాల్లో లేకి దృశ్యాల్లా....

వరకట్నపు హత్యల్లా...

రైతుల ఆత్మహత్యల్లా...

అమాయకుల ఎన్‌కౌంటర్లలా...

దళితుల వూచకోతల్లా...

అన్నీ.. అన్నీ... సాధారణ దృశ్యాలయిపోయాయి.


ఈ సుదీర్ఘ ప్రయాణంలో నేర్చుకోవలసిందీ పెంపొందించుకోవలసింది ఇదేనా..

ఆ ముసిలామె కళ్ళు సూటిగా నన్నే చూస్తున్నాయి.

శోధిస్తున్నట్లుగా...

బోధిస్తున్నట్లుగా...

★



## వెల్‌కమ్ టు రేడియోమిర్చి

సినిమా హీరోయిన్ల గ్లామర్ ఇప్పుడు రేడియోల్లోకి రాబోతోంది. ఇటీవలే ముంబయ్‌లో రేడియో మిర్చి ఛానెల్ లాంచ్ అయింది. దీనికి ప్రమోషన్ వర్క్‌లో భాగంగా బిపాషా బసును ఆహ్వానించారు. నీ అందమే కాదు, నీ మాటలతోనూ ప్రతిభ చూపించు అంటూ చెప్పుకొచ్చారు. కురుచ దుస్తులేసుకుని సెక్సీగా కనిపించే బిపాషా ఇప్పుడు తన మాటలనూ వినిపించబోతోంది. దీనికోసం ఆమెకు భారీ పారితోషికమే ఇస్తున్నారుట. బిపాషాతో పాటు ప్రీతిజింటా, అనిల్‌కపూర్, షారుఖ్ లాంటి వారు కూడా రేడియోమిర్చి ఛానెల్‌కు ఒప్పందం కుదుర్చుకున్నారు. వెండితెర, బుల్లితెరల ద్వారానే కాకుండా మరో రంగం వీరికి కాసుల వర్షం కురిపించబోతోంది.